కథ

# థాంక్యూ పద్మశ్రీ!

**"అమ్మా, భోజనం పంపమంటారా?"**

**సుప్రియ తలెత్తి సుబ్బారావు వైపు చూసింది. అతడు ఆమె జవాబు కోసం ఎదురు చూస్తున్నాడు. అవునుమరి. సమయం పన్నెండు కావస్తూంది. అతనూ భోంచేసి పడుకోవాలి కదా.**

**"బాబు, వాళ్ళ నాన్నగారు భోజనం చేశారా"**

**"ఇంకా లేదమ్మా. వాళ్ళు బిజీగా ఉన్నారు" అంటూ నవ్వాడు. ఆ నవ్వుకు అర్థం సుప్రియకు తెలుసు. అలాంటి నవ్వులు చూడటం ఆమెకు మామూలే. తన భర్త, కొడుకు తాగుతున్నారు. ఆ విషయాన్ని యితరులు తనకు చెప్పే పద్ధతి అది.**

''నాకు భోజనం వద్దు. ఒక గ్లాసు మజ్జిగ పంపించండి. చాలు''

సుబ్బారావు వెళ్ళిపోయాడు. సుప్రియకు సన్మానం చేసిన సాంస్కృతిక సంస్థకు సెక్రటరీ అతను.

సుప్రియ అలసటగా పరుపుపై పడుకొంది. ఉదయం నుంచీ ఉన్న ఉత్సాహం, ఆనందం ఆమెలో మాయమయ్యాయి. సుప్రియ పేరు ప్రఖ్యాతులుగల సినిమా నటి, దర్శకురాలు. తొలుత హీరో చెల్లెలుగా సినీరంగంలో ప్రవేశించి హీరోయిన్‌గా, తర్వాత హీరో అక్క, తల్లి పాత్రలు పోషించి, ఆ తర్వాత దర్శకురాలిగా మారింది. దాదాపు పాతిక సినిమాలకు దర్శకత్వం వహించి మంచి దర్శకురాలిగా పేరు తెచ్చుకుంది. ఆమె సినీరంగంలో ప్రవేశించి పాతికేళ్ళు పూర్తయిన సందర్భంగా తిరుపతిలోని ఓ సాంస్కృతిక సంస్థ సిల్వర్ జూబ్లీ ఫంక్షన్ ఏర్పాటు చేసి ఆమెను సత్కరించింది. ఆ సభకు సినీ, రాజకీయ ప్రముఖులు వచ్చారు. ఫంక్షన్ రాత్రి పదకొండు గంటలకు ముగిసింది. అందరి దగ్గరా శెలవు తీసుకొని తన గదికొచ్చి కాసేపు పడుకొంది. ఈ లోపలే తండ్రీ కొడుకులు తాగడం మొదలుపెట్టినట్లున్నారు.

ఆమెకు వాళ్ళంటే ఎంతో అసహ్యం వేసింది. ఈ ఒక్కరోజు తన గౌరవం దక్కించాలని వాళ్ళకు అన్పించదా? ఒక్కరోజు తాగకుండా ఉండలేరా? చూసినవాళ్ళు ఏమనుకొంటారు? 'సినిమాల్లో అన్ని నీతులు చెబుతుంది. మరి తన కొడుకును అలా గాలికి వదిలేసిందే' అనుకోరూ.

బాధగా కళ్ళు మూసుకొని పడుకొంది. అలసట వల్ల వెంటనే నిద్ర పట్టింది. ఉదయం నాలుగు గంటలకు మెలకువ వచ్చింది ఆమెకు. గదిలోని ఫోను నుంచి భర్త మొబైల్‌కు ఫోన్ చేసింది.

''మనం చిత్తూరుకు బయలుదేరాలి. వెంటనే మీరిద్దరూ నా గదికి రండి''

''చిత్తూరుకా? మన ప్రోగ్రామ్‌లో చిత్తూరు లేదే?''

''ఇప్పుడు ఉంది. సరేనా? ఈ రోజు సరోజ కృష్ణల షష్టిపూర్తి ఫంక్షన్ ఉంది. కాబట్టి నేను తిరుపతిలోని ప్రోగ్రామ్స్‌కు అటెండ్ కావడం లేదు. నేను లేకపోయినా వాళ్ళకు కలిగే నష్టం ఏమీ లేదు. నేను సరోజను, కృష్ణను, వాళ్ళ పిల్లల్ని చూడాలి. మీరు దీపక్‌ను కూడా పిలుచుకొని రండి. మనం వీలైనంత త్వరగా బయలుదేరుదాం'' అంటూ ఫోన్ పెట్టేసింది సుప్రియ.

★ ★ ★

''మనం చిత్తూరుకు వెళ్ళే తీరాలా?'' శ్రీనివాసరావు అడిగాడు సుప్రియను.

''నేను మాత్రం వెళ్ళి తీరాలి'' అంది సుప్రియ స్థిరంగా.

''అక్కడ నాకు బోరు కొడుతుంది మమ్మీ. ట్రై టు అండర్‌స్టాండ్ మీ'' అన్నాడు దీపక్ తల్లితో.

''అవునురా. అందర్నీ నేనే అర్థం చేసుకోవాలి. నా బాధ, కోరికలు మాత్రం మీరు అర్థం చేసుకోరు'' అంది సుప్రియ బాధగా.

''అబ్బ! నువ్వు మరీ అంత సీరియస్ అయిపోకు మమ్మీ. అలాగే వెళదాం'' అన్నాడు దీపక్.

భార్య సీరియస్‌గా ఉండటంతో శ్రీనివాసరావు మాట్లాడకుండా కారులో కూర్చున్నాడు. కారు చిత్తూరు వైపు కదిలింది. కారులో కూర్చున్న సుప్రియ మనసు ఆనందంతో గంతులెయ్యసాగింది, తను పుట్టి పెరిగిన ఊరిని, తన వాళ్ళను చూడబోతున్నందువల్ల. దారిలో రైల్వే గేటు దగ్గర కారు ఆపాడు డ్రైవరు. ట్రైను వస్తున్నందువల్ల గేటు వేశారు.

''చిత్తూరుకు బ్రాడ్‌గేజ్ లైను వేశారని పేపర్లో చదివాను. హైదరాబాదుకు డైరక్ట్ ట్రైయిన్స్ కూడా వేశారట'' అన్నాడు శ్రీనివాసరావు.

''మేము చదువుకొనేటప్పుడు ఒకటో, రెండో ట్రైన్స్ నడిచేవి. మేము ఏ ఊరికి వెళ్ళాలన్నా బస్సుల్లోనే వెళ్ళే వాళ్ళము'' అంది సుప్రియ పాత రోజుల్ని గుర్తుకు తెచ్చుకొంటూ.

చిత్తూరు టౌన్లో కారు ప్రవేశించగానే కార్లో నుంచి ఊరిని ఆసక్తిగా చూడసాగింది సుప్రియ. అన్నీ తనకు పరిచయమైన వీధులే. ఊరు పెద్దగా ఏమీ మారలేదు. పెంకుటిళ్ళ స్థానంలో మేడలు లేచాయి. రోడ్లు కాస్త విశాలమయ్యాయి. అంతే తేడా! అనుకుంది.

కృష్ణమూర్తి యిల్లు కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు వాళ్ళకు. ఇంటి ముందు పందిరి వేసి ఉన్నారు. బయట ఓ ముప్పై ఏళ్ళ యువకుడు నిలబడి కొంతమందితో మాట్లాడుతూ కనిపించాడు. అతన్ని కృష్ణమూర్తి కొడుకు సాయితేజగా గుర్తించింది సుప్రియ.

కారులోంచి దిగుతున్న సుప్రియను చూడగానే ఆశ్చర్యంతో ఎదురొచ్చాడు సాయితేజ.

''రండి అత్తయ్యా''

''నువ్వు సాయితేజవు కదూ?'' అని అడిగింది సుప్రియ. అవునన్నట్లు తలూపాడు తేజ.

''ఎంత ఎదిగిపోయావురా?'' అంటూ ఆప్యాయంగా అతని చేయి అందుకొని ''సరోజ ఏది?'' అని అడిగింది.

''పెళ్ళికూతురు కదా. రెడీ అవుతూంది'' అంటూ నవ్వి ''హలో దీపక్. హౌ ఆర్ యూ? రండి అంకుల్. లోపలికి రండి'' అంటూ ముగ్గురినీ యింటిలోకి పిలుచుకొని వెళ్ళాడు తేజ.

పట్టుచీర కట్టుకొని అప్పుడే హాల్లోకొచ్చిన సరోజ సుప్రియను చూడగానే ఆశ్చర్యపోయింది.

''అరె.. ప్రియా నువ్వేనా? నేను కలగనడం లేదు కదా'' అంటూ తన చేతిని గిల్లుకొంది.

''అబ్బ.. షష్టిపూర్తి చేసుకొంటున్నా నీకింకా చిలిపితనం పోలేదు'' అంటూ నవ్వింది. ఇద్దరూ చేతులు పట్టుకొని ఆప్యాయంగా చూసుకుంటూ ఉండగా కృష్ణమూర్తి వచ్చాడు.


''అరె, సుప్రియా. ఎంత అదృష్టం మాకు? నిన్న తిరుపతిలో నీకు సన్మానం ఉందని, అంతవరకూ వచ్చినదానవు చిత్తూరుకు రాకుండా ఉండవని, పైగా మా షష్టిపూర్తి ఫంక్షన్ కూడా ఉంది

కనుక నువ్వు తప్పకుండా వస్తావని నేను సరోజతో అంటే తను నాతో ఏకీభవించ లేదు'' ఇప్పుడేమంటావు అన్నట్టు భార్యవైపు చూస్తూ అన్నాడు కృష్ణ మూర్తి.

''రండి. టిఫిన్ తీసుకొందురు'' అంటూ తేజ వాళ్ళను మేడపైకి తీసుకె ళ్ళాడు. అక్కడ టిఫిన్ వడ్డిస్తున్న తన యిద్దరు చెల్లెళ్ళను వాళ్ళకు పరిచయం చేశాడు.

''మిమ్మల్ని నేను చివరిసారి చూసిన ప్పుడు చాలా చిన్నపిల్లలు మీరు. ఏం చదువుతున్నారు?'' అని అడిగింది సుప్రియ.

''నేను బి.ఎస్.సి. చదువుతున్నాను. నీరజ ఇంటర్మీడియట్'' అంది పద్మజ. వాళ్ళిద్దరికీ ఎగ్జయిట్‌మెంట్‌గా ఉంది. సుప్రియ పేరున్న నటి, దర్శకు రాలని, ఆమె తమకు బంధువు అవు తుందని తెలుసుగాని ఆమె తమ యింటికి వస్తుందని వాళ్ళేనాడూ ఊహించలేదు.



'ఎంత బాగున్నారు పిల్లలు? చిదిమి దీపం పెట్టుకోవచ్చు అంటారే. అలా ఉన్నారు. పరికిణీ, లంగాలు ఆడపిల్ల లకు ఎంత అందాన్నిస్తాయో చాలామం దికి అర్థంకాదు' అనుకొంది సుప్రియ.

తేజ ఒక నిమిషం కూడా కూర్చో కుండా ఏదో ఒక పని చేస్తూనే ఉన్నాడు. వచ్చిన వాళ్ళను రిసీవ్ చేసుకోవడం, వంటవాళ్ళను పురమాయించడం, హోమానికి కావలసినవి పురోహితు లకు అందించడం లాంటి పనులతో బిజీగా వున్నాడు. అప్పటికే చాలామంది వచ్చేశారు. ఇల్లు నిండిపోయి బయట షామియానా క్రింద కొంతమంది కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సుప్రియ కూడా భర్తా కొడుకులతో మాట్లాడుతూ అక్కడే కూర్చుంది.

వచ్చిన వాళ్ళు సుప్రియను గుర్తించి పలుకరించ సాగారు. సరోజ బంధువులతో సుప్రియకు కూడా బంధుత్వం ఉండటంతో అందరూ ఆమెని ఆప్యాయంగా పలుకరించసాగారు.

''మీరు తేజ బాబుకు ఏమవుతారమ్మా?'' ఓ ముసలాయన అడిగాడు సుప్రియను.

''తేజ తల్లి సరోజ నాకు అత్తకూతురవు తుంది. నేను చిత్తూరులోనే పుట్టి పెరిగాను. సరోజతో నాకు బంధుత్వం కంటే స్నేహమే ఎక్కువ. ఆ రోజుల్లో ఈ ఊర్లో మేమిద్దరం కలిసి తిరగని వీధి లేదు. చూడని సినిమా లేదు'' అంది సుప్రియ.

''మాకు కృష్ణమూర్తి సారు, సరోజమ్మ తేజ బాబు ద్వారానే పరిచయమయ్యారు. తేజ మాకందరికీ నెల నెలా పెన్షను బ్యాంకు నుండి యింటికే తెచ్చిస్తాడు. మాకు ఏ అవసరమొచ్చినా తను ముందుంటాడు. వాళ్ళ అమ్మానాన్నల్ని కళ్ళల్లో పెట్టుకొని చూసుకొంటాడు. ఇటు వంటి బిడ్డ మాకూ ఉంటే ఎంత బాగుండేది అని మేము అనుకొంటూ ఉంటాము'' అన్నాడు ఆ ముసలాయన.

**సి.ఎన్.చంద్రశేఖర్**

సుప్రియకు ఆశ్చర్యమేసింది. తను తేజను ఆరే ళ్ళప్పుడు చూసింది. అప్పటికీ యిప్పటికీ తేజ వయసులోనే కాదు, మనిషిగా కూడా ఎంతో ఎది గాడనిపించింది ఆమెకు. సుప్రియ కొడుకు వైపు, దూరంగా ఉన్న తేజ వైపు మార్చి మార్చి చూసింది. నిజానికి దీపక్- తేజ కంటే అంద గాడు. కానీ చేస్తున్న ఉద్యోగం వల్ల ఆత్మవి శ్వాసం, తల్లిదండ్రులతో, తోబుట్టువులతో కలిసి ఉన్నందువల్ల ఆనందం, తృప్తి, క్రమశిక్ష

ణతో కూడిన నడవడిక వల్ల తేజ మరింత అందంగా కనబడుతున్నాడు. దీపక్ డిగ్రీ అయ్యాక అటు ఉద్యోగం చెయ్యలేక, వ్యాపారం లోనూ రాణించలేక ప్రస్తుతానికి ఖాళీగానే ఉన్నాడు. పైగా త్రాగుడు వ్యసనంగా మారి అతని అందాన్ని హరించివేస్తున్నది.

షష్టిపూర్తి ఫంక్షన్ పూర్తయింది. తిరుమల నుంచి వచ్చిన పురోహితులు శాస్త్రోక్తంగా, ఎక్కడా రాజీపడకుండా చక్కగా కార్యక్రమాల్ని నిర్వహించారు. సుప్రియ- సరోజా కృష్ణమూర్తు లకు చెరొక వెయ్యిన్నొట పదహార్లు చదివించింది.

భోజన కార్యక్రమాలు అయ్యాక తేజ సుప్రియ వాళ్ళు కూర్చున్న చోటికి వచ్చి తనూ ఓ కుర్చీలో కూర్చుని ''బోరు కొడుతూందా దీపక్?'' అని దీపక్‌ని అడిగాడు.

''అఫ్‌కోర్స్.. ఏ బ్యాంకులో పనిచేస్తున్నావు నువ్వు?''

''స్టేట్ బ్యాంక్‌లో. నువ్వేం చేస్తున్నావు?''

''ప్రస్తుతానికి ఖాళీగానే వున్నాను. ఏదైనా బిజినెస్ చెయ్యాలని నా ప్లాను'' ఇంతలో తేజ పెదనాన్న కొడుకు ప్రభు అక్కడికి వచ్చి కూర్చున్నాడు.

''దీపక్! ఇతను ప్రభు. మా పెదనాన్న కొడుకు'' అంటూ దీపక్‌కు పరిచయం చేశాడు.

''ఫంక్షన్ చాలా బాగా జరిగింది. ఎంతయింది ఖర్చు?'' ప్రభు తేజని అడిగాడు.

''ముప్పై వేలు''

''అంత ఖర్చు అవసరమంటావా?''

''మా కోసం అమ్మానాన్నలు ఎంతో కష్టపడ్డారు. వాళ్ళకోసం ఓ ముప్పై వేలు నేను ఖర్చుపెట్టలేనా? తమ కొడుకు తమ కోసం యింత చేశాడని వాళ్ళకు కలిగే ఆనందం ముందు ముప్పై వేలు ఓ లెఖ్ఖా?''

''మీ నాన్నగారి రిటైర్మెంట్ తాలూకు డబ్బులు వాడావా?''

''ఆ డబ్బు నేను తాకలేదు. షష్టిపూర్తి తమకు తాము జరుపుకొనే పండుగ కాదు. పిల్లలు యిష్టంతో జరిపే పండుగ. ఈ ఫంక్షన్‌కు మొత్తం నా డబ్బే ఖర్చుపెట్టాను. అలా వాళ్ళకోసం ఖర్చుపెట్టే అవకాశం దొరకడం నా అదృష్టం'' అన్నాడు తేజ.

''అయినా ముప్పై వేలు ఖర్చుపెట్టడం అవివేకమనే అంటాను నేను. సింపుల్‌గా యింటివరకు చేసుకొని ఉండొచ్చు''

''లేదు ప్రభూ. షష్టిపూర్తికి వల్లించే మంత్రాలు చాలా శక్తివంతమైనవి. హోమమూ అవీ చేస్తే మరో అరవై ఏళ్ళు ఆ జంట ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటారని అంటారు. షష్టిపూర్తి చాలా అరుదుగా జరిగే ఫంక్షన్ కాబట్టి బంధుమిత్రులందరూ చూడాలని ఆశపడతారు. పైగా మనింట్లో పది మంది భోజనం చేస్తే అది మనకు మంచే చేస్తుంది కదా?''

''మా నాన్న షష్టిపూర్తి చేసుకొన్న రెండేళ్ళకే పోయారు. దానికేమంటావు?''

''అలా పోల్చవద్దు. ఎవరి కర్మఫలాలను అనుసరించి అలా జరుగుతుంది''

''మరి అలాంటప్పుడు యివన్నీ ఎందుకు?'' అన్నాడు ప్రభు.

''నా తృప్తికోసం. సరేనా? నేను నీ అంత మాటకారిని కాను ప్రభూ'' అన్నాడు తేజ నవ్వుతూ.

ప్రభు వెళ్ళిపోయాక ''అతడు అంత వితండవాదం చేస్తూ, అశుభంగా కూడా మాట్లాడుతూంటే అంత కూల్‌గా ఎలా ఉన్నావు తేజా'' అని అడిగాడు దీపక్.

''అతని తత్వం అంతే. నేను నమ్మే సిద్ధాంతం ఒకటే. 'టు లూజ్ ఏన్ ఆర్గ్యుమెంట్ ఈజ్ బెటర్ దేన్ లూజింగ్ ఎ ఫ్రెండ్' ప్రభు నాకు మంచి స్నేహితుడు. అందుకే అతనెలా మాట్లాడినా సర్దుకుపోతాను'' అన్నాడు తేజ.

అతని మాటలు కొద్ది దూరంలో కూర్చుని ఉన్న సుప్రియ విని ఆశ్చర్యపోయింది. అంత చిన్న వయసులోనే అంత మెచ్యూర్డ్‌గా ఆలోచించే తేజ ఆమెకెంతో నచ్చాడు.


శ్రీనివాసరావుకు తనకు వచ్చే సంవత్సరం అరవై ఏళ్ళు నిండుతున్న విషయం గుర్తుకొచ్చింది. తన కొడుకు కూడా తమ షష్టిపూర్తి యిలా పండుగలా జరుపుతాడా! డబ్బు ఎక్కడ నుంచి తెస్తాడు? తల్లినడిగి తీసుకుంటాడేమో. అప్పుడు తన షష్టిపూర్తి జరిపించేది కొడుకా? భార్యా? అతనికి జవాబు తోచింది కాని అది రుచించలేదు.

సాయంత్రం కృష్ణమూర్తి సుప్రియ వాళ్ళను ప్రక్కవీధిలో ఉన్న సుప్రియ సొంత యింటికి పిలుచుకొని వెళ్ళాడు. ఆ యిల్లు సుప్రియకు ఆమె తండ్రి నుంచి సంక్రమించింది. సంవత్సరం క్రితం ఆమె కృష్ణమూర్తికి లక్ష రూపాయలు పంపించి యింటిని రీమోడలింగ్ చేయించమని కోరింది. ఆమె కోరినట్టే ఆ పని చేయించాడు కృష్ణమూర్తి.

ఆ యింట్లో కాపురముంటున్నవాళ్ళు సుప్రియను చూసి ఎంతో ఎగ్జయిట్‌మెంట్ ఫీలయి మర్యాదలు చేశారు. ఇల్లు చూసి ఎంతో సంతోషపడింది సుప్రియ.

## డ్రీంగర్ల్

పెద్దల సభకి నామినేట్ అయినప్పటినుంచీ హేమమాలినీకి అప్పుడే రాజకీయం అబ్బినట్టుంది. మొన్నామధ్య పత్రికల వారితో మాట్లాడినప్పుడు ఈ విషయం స్పష్టమైంది. 'బాగ్ బన్' చిత్రం తరువాత ఆమె ఇప్పుడు తన దృష్టిని బుల్లితెరపై నిలుపుతున్నట్టుంది. సహారా టీవీ ఈ డ్రీంగర్ల్‌ని ప్రధాన పాత్రధారిణిగా పరిచయం చేస్తూ సరికొత్త ధారావాహికని త్వరలో ప్రసారం చేయనుంది. 'పెద్దతారలకి బుల్లితెర ఎంతో అనువుగా ఉంటుంది. ఎందుకంటే కెమేరా ముందుకెళ్లడం వారికేం కొత్తకాదు. అన్నట్టు బుల్లితెర నాకేం కొత్తకాదు' అంటోంది హేమ. రవిచోప్రా దర్శకత్వం వహిస్తున్న ఈ సీరియల్‌లో హేమ ఇంకా అందంగా కన్పించనుందంటున్నారు.



''థాంక్యూ కృష్ణ. పాత యింటిని కొత్త యిల్లులా మార్చేశావు'' అంది సుప్రియ.

''అది ఇంజనీరు ప్రతిభ. సతీష్ అని బెంగుళూరులో ఇంజనీర్. మన తేజకు ఫ్రెండ్. మనసు పెట్టి చేశాడు కనుక యింత బాగా వచ్చింది'' అన్నాడు కృష్ణమూర్తి.

## విధి

**ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన కరిష్మా-ది మిరాకిల్స్ ఆఫ్ డెస్టినీ సీరియల్ ఇంతకుముందు రోజూ రెండుసార్లు ప్రసారం అయ్యేది. మిగతా ఛానెల్స్ కూడా ప్రైమ్‌టైంలో ప్రసారం చేసిన సీరియల్స్‌ని మహిళా ప్రేక్షకుల కోసం ఉదయం పూట ప్రసారం చేస్తున్నాయి. అయితే సహారా టీవీ రొటీన్‌కి భిన్నంగా ఏ సీరియల్‌నైనా ఒకసారే ప్రసారం చేయాలని సంకల్పించింది. ఈ నిబంధన కరిష్మా సీరియల్ నుంచే ప్రారంభం కావడం యాదృచ్ఛికం అంటున్నారంతా. సహారా టీవీ ఈ సీరియల్‌ని కరిష్మా ఇమేజ్‌కి తగినట్టుగా రూపొందిస్తోంది. పెళ్లయ్యాక కరిష్మా ఇంటిదగ్గర ఉండి తన సీరియల్‌ని రోజుకి రెండుసార్లు చూసే ఛాన్స్‌ని మిస్ చేసుకుంది. అందుకే మన పెద్దలంటుంటారు కాలం అన్నిసార్లూ ఒకేలా ఉండదని.**

''నువ్వు మంచి మనసుతో చేశావు కనుక యింత బాగా వచ్చింది. కాబట్టి ఆ క్రెడిట్ నీకే చెందాలి. ఇంజనీరుకు కాదు'' అంది సుప్రియ.

★ ★ ★

ఆ రోజు రాత్రి మేడమీద ఒంటరిగా కూర్చుని ఉన్నాడు దీపక్. అతనికి చిత్తూరు రావడం, తన తల్లి తాలూకు బంధువులతో రోజంతా గడపడం, పద్మజ, నీరజ, తేజ తనను అభిమానంగా చూడటం ఒక కలలా అనిపిస్తూంది. తన తండ్రి తరపు బంధువులు, తన ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఫ్రెండ్స్ అందరికంటే భిన్నంగా కనిపించారు తేజ యింట్లోని వాళ్ళు. అతనికి పద్మజ ఎంతగానో నచ్చింది. మొదట్లో పట్టించుకోలేదుగానీ చూస్తున్నకొద్దీ ఆమె అంటే ఆసక్తి ఏర్పడింది అతనికి.

ప్రక్కన అలికిడైతే తల త్రిప్పి చూశాడు. పద్మజ నిలబడి ఉంది.

''భోజనానికి రండి. అందరూ మీ కోసమే వెయిట్ చేస్తున్నారు'' అంది పద్మజ.

''వస్తాను. ఒక్క నిముషం కూర్చోండి. బి.ఎస్.సి.లో ఏ గ్రూపు మీది?'' అన్నాడు దీపక్.

''మాథ్స్ ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ'' అంది అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుంటూ.

''చాలా మంచి గ్రూపు. ఆ గ్రూపు తీసుకొన్న వాళ్ళు ప్రతీదీ ఓ పద్ధతి ప్రకారం, కాలిక్యులేటెడ్‌గా చేస్తారు కనుక జీవితంలో బాగా రాణిస్తారు''

''థాంక్యూ. మీరేం చదివారు?'' పద్మజ అడిగింది.

''బి.కాం.''

''ఇప్పుడేం చేస్తున్నారు?''



''ఏమీ చేయటం లేదు. ప్రస్తుతానికి ఖాళీగానే ఉన్నాను''

''మీరు బి.కాం. పూర్తి చేసి ఎన్నేళ్ళయింది?''

''మూడేళ్ళు''

''అంటే మూడేళ్ళు ఖాళీగా ఉన్నారా?''

''అవును. అయితే ఏం? నాకు అర్జెంటుగా ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించాల్సిన అవసరం లేదు''

''కావొచ్చు. ఖాళీగా ఉంటే బుర్ర పాడైపోతుంది. మనిషి ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూండాలని మా అన్న అంటూంటాడు. ఐడిల్ మేన్ బ్రైన్ డెవిల్స్ వర్క్‌షాప్ అట''

''నా క్వాలిఫికేషన్‌కు ఓ మూడువేల రూపాయల జీతం వచ్చే ఉద్యోగం దొరుకుతుంది. మా డ్రైవరుకు అంత కంటే ఎక్కువే పే చేస్తాము మేము'' అన్నాడు దీపక్.

''అయినా ఆ డ్రైవరే మీకంటే గొప్పవాడంటాను నేను. ఎందుకంటే అతను సొంతంగా సంపాదించుకొంటున్నాడు కాబట్టి'' అంది పద్మజ.

దీపక్ ముఖం అవమానంతో ఎర్రబడింది.

''సారీ.. మిమ్మల్ని అవమానించాలని కాదు. వాదన వచ్చింది కాబట్టి చెబుతున్నాను. మా అన్న ఫ్రెండు సత్యం ఓ కంపెనీలో మూడువేల రూపాయల జీతానికి చేరాడు. క్రమంగా తన తెలివితేటలతో, చిత్తశుద్ధితో ఎదిగి అయిదేళ్ళలో పెద్ద ఆఫీసర్ అయ్యాడు. ఈ రోజు అతని జీతం ముప్పై వేలు. కారు, బంగళా కంపెనీ యిచ్చింది. ఇవన్నీ కాక అతనన్నా, అతని మాటన్నా ఆ కంపెనీలో అందరికీ గౌరవం. ఈ జీతం, ఈ గౌరవం నా స్వయంకృషితో సాధించుకొన్నది అనుకొంటే ఎంత గర్వంగా ఉంటుంది. కష్టే ఫలి అని ఊరికే అనలేదు మన పెద్దలు''

ఇంతలో క్రింద నుంచి సరోజ పిలుపు వినబడింది. పద్మజ లేచి నిలబడి ''రండి. క్రిందికెళదాం. నా మాటలు మనసులో పెట్టుకోకండి. ప్లీజ్'' అంది అభ్యర్థనగా.

''మీ మాటలు ఎప్పుడూ మనసులో పెట్టుకొంటాను'' అంటూ కదిలాడు దీపక్.

★ ★ ★

భోజనాలప్పుడు సుప్రియ కృష్ణమూర్తిని ''మీరు యిల్లు ఎప్పుడు కట్టుకొంటారు కృష్ణ'' అని అడిగింది.

''దేనికైనా టైము రావాలి కదా సుప్రియా. ఇంకో సంవత్సరం పోతే తేజకు హౌసింగ్ లోను తీసుకొనే అర్హత వస్తుంది. అప్పుడు మొదలుపెట్టాలని అనుకొంటున్నాం. నా రిటైర్మెంట్ డబ్బు ఒక పిల్ల పెళ్ళి చేయడానికి సరిపోతాయి. ఇంటికంటే పిల్లల పెళ్ళిళ్ళే నాకు ముఖ్యం'' అన్నాడు కృష్ణమూర్తి.

తేజ కల్పించుకొంటూ ''నాకు ఎలిజిబిలిటీ రాగానే ఫ్లాటు కొని యిల్లు కట్టేస్తాను. ఆ యింట్లో అమ్మానాన్నలకు ఓ సెపరేట్ రూమ్ కట్టిస్తాను. అటాచ్డ్ బాత్‌రూమ్, ఓ చిన్న లైబ్రరీ, మ్యూజిక్ సిస్టమ్స్ అన్నీ అందులోనే ఉంటాయి'' అన్నాడు. అతడు కళ్ళముందు ఊహించుకొంటూ చెప్తున్నట్లు అనిపించింది అందరికీ.

పద్మజ చప్పట్లు కొట్టి ''అన్నయ్యా. ఇక కల నుంచి యిలకు దిగిరా'' అంది. అందరూ నవ్వారు.

సుప్రియ మాత్రం ''చెప్పనీ, తేజకు అమ్మానాన్నలంటే ఎంత ప్రేమ ఉంటే అంత తన్మయత్వం ఫీలౌతాడు. ఐ విష్ యూ ఆల్ ద బెస్ట్ తేజా. దేవుడు నీ మంచి కోరికను తప్పకుండా తీరుస్తాడు'' అంది.

''థాంక్యూ అత్తయ్యా'' అన్నాడు తేజ సంతోషంగా.

తరువాత సుప్రియ సరోజతో ''మేము రేపు ఉదయాన్నే బయలుదేరుతాం సరోజా'' అంది.

''అదేం. నాలుగు రోజులు ఉండవచ్చుగా. రాక రాక వచ్చావు మా యింటికి'' అంది సరోజ.

''లేదులే. రేపు సాయంత్రం వెంకటాద్రికి మాకు రిజర్వేషన్ అయింది. ఉదయం తిరుమలలో దర్శనానికి మాకు ఏర్పాట్లు చేశారు. కాబట్టి రేపు ఉదయం అయిదు గంటలకు బయలుదేరుతాం. మీ ఆతిథ్యానికి చాలా థాంక్స్'' అంది సుప్రియ.

సరోజ సుప్రియకు చీరా, రవికా, శ్రీనివాసరావుకూ, దీపక్‌కూ షర్ట్‌పీస్‌లూ తాంబూలంలో పెట్టి యిచ్చింది.

''ఇప్పుడివన్నీ ఎందుకు?'' ఇబ్బందిగా చూస్తూ అంది సుప్రియ.

''మన సాంప్రదాయం. పైగా నీకు నేను గుర్తుండాలి కదా. కనీసం ఈ చీర కట్టుకున్నప్పుడైనా నేను గుర్తొస్తాను''

''గుర్తులేకుంటే నీ షష్టిపూర్తికి వచ్చేదాన్నా?''

''అది మా అదృష్టం. దీపక్ పెళ్ళికి పిలవడం మరచిపోకు. మేమందరం తప్పకుండా వస్తాము''

''మీరందరూ రాకుంటే నేను పెళ్ళే చేసుకోను ఆంటీ'' అన్నాడు దీపక్.

''అలాగా. అయితే నేను మీ పెళ్ళికి రాను. మీరు ఎలా పెళ్ళి చేసుకోకుండా ఉంటారో చూస్తాను'' అంది పద్మజ.

''యిక్కడికి వచ్చి మిమ్మల్నే లాక్కొని వెళ్ళి మూడు ముళ్ళూ వేస్తాను'' అన్నాడు దీపక్.

''అయ్యబాబోయ్. మీరు మూడుముళ్ళు వేయ్యాల్సింది పెళ్ళి కూతురికండీ బాబూ'' అంది నవ్వుతూ.

అందరూ వాళ్ళ మాటలకు నవ్వారు. తను పొరబాటుగా అలా మాట్లాడినా తన మనసులోని మాటనే బయటకు చెప్పానని అనుకొన్నాడు దీపక్.

★ ★ ★

కొద్దిరోజుల్లోనే దీపక్ ఓ ఉద్యోగంలో చేరాడు. తన మొదటి జీతంతో ఓ ఉంగరాన్ని కొని తల్లికి బహూకరించాడు.

''చాలా బాగుందిరా? మంచి సెలక్షన్ నీది'' అంది సుప్రియ సంతోషంగా.

''అమ్మా! నీ దగ్గర ఉన్న ఆభరణాల్లో చాలా చీప్ అయిటమ్ యిదే కదూ..'' ఉంగరాన్ని ఆమె వ్రేలికి తొడుగుతూ అన్నాడు దీపక్.

''కాదురా. అన్నిటికన్నా విలువైనది యిదే. ఎందుకంటే యిది నా బిడ్డ తన కష్టార్జితంతో నాకు ప్రేమగా కొనిచ్చిన కానుక. తల్లి బిడ్డ మనసును చూస్తుందిరా. పర్సును కాదు'' అంటూ దీపక్ తలను తన భుజంపై ఆనించుకొంది. చిత్తూరు ట్రిప్ దీపక్‌లో పరివర్తన తీసుకొచ్చిందని ఆమెకు అనిపించింది. 'దేవుడి దయవల్ల త్రాగుడు కూడా మానేస్తే తనకు చింతే లేదు' అనుకొంది.

''అమ్మా. చిత్తూరులో ఉన్న మన యింటిని తేజ వాళ్ళకు యిచ్చేద్దామా? మనం ఎటూ ఆ యింటిలో ఉండబోవడం లేదు కదా. పైగా ఎవరికో అమ్మే కంటే తేజా వాళ్ళకు యిస్తే మనం ఆ యింటికి ఎప్పుడైనా వెళ్ళొచ్చు. మీ నాన్నగారి గుర్తుగా ఉన్న ఆ యింటిని మనం చూసుకుంటూ ఉండొచ్చు'' అన్నాడు దీపక్.

సుప్రియ దీపక్ వైపు ఆశ్చర్యంగా చూసింది. 'సరిగ్గా తన మనసులోని మాటే అతని నోట వచ్చింది. పైగా దీపక్ యింత బ్రాడ్‌గా ఆలోచించడం, మాట్లాడటం తనకు తెలిసి యిదే మొదటిసారి' అనుకొంది.

''నాకూ ఆ ఆలోచనే వచ్చిందిరా. మీ నాన్నగారితో కూడా మాట్లాడి కృష్ణమూర్తికి ఉత్తరం రాస్తాను'' అంది. తేజ యిల్లు కట్టుకోవాలని అన్నప్పుడే ఆమెకు ఆ ఆలోచన వచ్చింది. భర్తతో, కొడుకుతో చర్చించి నిర్ణయించాలనుకొంది.

శ్రీనివాసరావు అభ్యంతరం చెప్పకపోవడంతో కృష్ణమూర్తికి ఉత్తరం రాసింది.

ఆమె ఉత్తరం రాసిన వారం రోజులకు జవాబు వచ్చింది. తేజ రాశాడు.


''అత్తయ్యా. మీ అభిమానానికి, గొప్ప మనసుకు ఎంతో కృతజ్ఞులం.

అయితే యిల్లు కట్టుకోవడం ప్రతి మధ్యతరగతి మనిషికీ ఓ అందమైన కల. ఇంటికోసం డబ్బులు కూడబెట్టడం, చాలకపోతే అప్పులు చెయ్యడం, భూమి పూజ నుంచి గృహప్రవేశం వరకు యిల్లు అంచెలంచెలుగా పూర్తికావడం, పూర్తయిన యింటిని చూసి ఏదో సాధించినట్లు గర్వపడటం యివన్నీ మరపురాని అనుభూతులు. అవి మేము కూడా పొందాలంటే యిల్లు మేమే కట్టుకోవాలి. దయచేసి మాకు ఆ అనుభూతుల్ని పొందనీయండి.

మీ ఆఫర్‌ను తిరస్కరిస్తున్నందుకు మన్నించండి. మీ యింటిని వద్దంటున్నాం కానీ మీ అభిమానాన్ని, ఆదరణను కాదు. అర్థం చేసుకోగలరని నా నమ్మకం''

ఉత్తరాన్ని దీపక్ చేతికి యిస్తూ ''చూశావా. తేజ ఏం రాశాడో. మేలుజాతి రత్నం వాడు'' అంది సుప్రియ.

దీపక్ చదవడం పూర్తి చేసి ''అవునమ్మా. అతని నుంచి నేను నేర్చుకోవలసిన విషయాలు ఎన్నో ఉన్నాయి. అసలు పద్మజ ఎంత బాగా మాట్లాడిందనుకొన్నావ్? ఒక విధంగా నాకు జ్ఞానోదయం కలిగించింది.




అమ్మా! పద్మజను నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. అయితే యిప్పుడే కాదు. సమాజంలో నాకంటూ ఓ స్థానం సంపాదించుకొన్నాక నేనే ఆమెను అడుగుతాను. నాకు కావలసింది నీ అంగీకారం, ఆశీస్సులు మాత్రమే'' అన్నాడు.

''నా ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉంటాయిరా.

పద్మజలాంటి కోడలు వస్తే ఎవరు వద్దంటారు?'' అంది సుప్రియ ఆనందంగా.